సాక్షి
వికారాబాద్

ఆదివారం । 31 । మార్చి । 2024



నిర్మించారు.. వదిలేశారు

బంట్వారం మండలం తోర్మామిడి గ్రామంలో రూ.30 లక్షలతో నిర్మించిన పాఠశాల భవనం నిరుపయోగంగా మారింది. 8లో▸



ఐరాసలో హ్యాట్రిక్ ప్రసంగం

బద్లాపూర్ యువకుడు ఐరాస వేదికగా పలు మార్లు ప్రసంగించి, జిల్లా పేరును ప్రపంచానికి చాటి చెప్పారు. 8లో▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ :	సహర్ :
ఆదివారం సాయంత్రం 6:34	సోమవారం ఉదయం 4:48

న్యూస్‌రీల్

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పర్వత్‌రెడ్డి



మాట్లాడుతున్న పర్వత్‌రెడ్డి

కొడంగల్: రాష్ట్రంలో పదేళ్లుగా ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పర్వత్‌రెడ్డి అన్నారు. మండలంలోని పర్సాపూర్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హతలు ఉన్నా ఉపాధ్యాయులు పదోన్నతులకు నోచుకోవడం లేదన్నారు. 317, సీపీఎస్ రద్దు, సీనియర్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు వంటి సమస్యలపై ఎస్టీయూ నిరంతర పోరాటం చేస్తుందన్నారు. ఎంఈఓ రాంరెడ్డి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, సంఘం నాయకులు షఫీ, శ్యామలమ్మ, హరిత, పవన్‌కుమార్, విష్ణుకుమార్, కరుణాకర్ పాల్గొన్నారు.

నాటుసారా విక్రయిస్తే కఠిన చర్యలు

అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి



నాటుసారా విక్రయిస్తున్న మహిళను అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ అధికారులు

పరిగి: నాటుసారా, మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని వికారాబాద్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం ఇబ్రహీంపూర్ తండా, మల్కాయ్యపేట తండా, సాలిప్పలబాట తండా, సోమచెరువు తండా తోపాటు దోమ, చౌడాపూర్ మండలాల్లో దాడులు నిర్వహించారు. నాలుగు కేసులు నమోదు చేసి, ముగ్గురిని అరెస్ట్ చేశారు. ఏడు లీటర్ల నాటుసారా, 600లీటర్ల బెల్లం పాకాన్ని సీజ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అక్రమంగా నాటుసార తయారు చేసినా, గంజాయి పండించినా చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు. వికారాబాద్‌ను నాటుసారా రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

పోలీసు తనిఖీల్లో రూ.9.39 లక్షలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నగదును చూపుతున్న పోలీసు అధికారులు

తాండూరు టౌన్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో తాండూరు పట్టణ పోలీస్‌స్టేషన్ వద్ద శనివారం డీఎస్పీ బాలకృష్ణారెడ్డి నేతృత్వంలో సీఐ సంతోష్ కుమార్ తన సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. మల్‌రెడ్డిపల్లికి చెందిన జెట్బూరు బస్వరాజ్ సైకిల్‌పై వెళుతుండగా ఆపి తనిఖీలు చేశారు. అతని వద్ద రూ.9.39 లక్షల నగదును ఉండటంతో స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. బస్వరాజ్ వద్ద లభించిన నగదుకు ఎలాంటి పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎక్కువ మొత్తం డబ్బు తీసుకెళ్లే వారు కచ్చితంగా సరైన పత్రాలు తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు. తనిఖీల్లో ఎస్ఐ కాశీనాథ్ పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టు ప్రవేశమార్గం వరకు ఏసీ బస్సులు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి రాకపోకలు సాగించే ఆర్టీసీ ఏసీ పుష్పక్ బస్సులు నేరుగా ఎయిర్‌పోర్టు ప్రవేశ మార్గం (డిపార్చర్స్) వరకు వెళ్లనున్నాయి. శనివారం నుంచి ఈ సదుపాయాన్ని అందుబాటులోకి వచ్చినట్లు ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ ఈడీ వెంకటేశ్వర్లు తెలిపారు. నగరంలోని జూబ్లీబస్టేషన్ , మియాపూర్, గచ్చిబౌలి, జేఎన్టీయూ, పర్యాటక భవన్, సికింద్రాబాద్ సంగీత్ చౌరస్తా, తార్నాక, ఉప్పల్ తదితర ప్రాంతాల నుంచి ఎయిర్‌పోర్టుకు నడిచే 49 ఏసీ బస్సులు అరైవల్స్‌తో పాటు డిపార్చర్స్ వద్ద కూడా ఆగనున్నాయి. ఈ సదుపాయంతో ప్రయాణికులు అరైవల్స్ నుంచి లగేజీతో డిపార్చర్స్ వరకు వెళ్లాల్సిన ఇబ్బంది ఉండదు. బస్సు దిగి లగేజీతో ఎయిర్‌పోర్ట్‌లోకి వెళ్లవచ్చు.

పరీక్ష ముగిసింది.. ఫలితం మిగిలింది



వికారాబాద్ జెడ్పీహెచ్ఎస్ వద్ద విక్టరీ సింబల్ చూపుతున్న విద్యార్థినులు

జిల్లాలో పదో తరగతి పరీక్షలు శనివారంతో ప్రశాంతంగా ముగిశాయి. ఈ నెల 18 నుంచి పరీక్షలు ప్రారంభమయ్యాయి. కలెక్టర్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేయడంతోపాటు ఎప్పటికప్పుడు అధికారులను అప్రమత్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా 160 సెంటర్లలో విద్యార్థులు పరీక్షలు రాశారు. శనివారం చివరి పరీక్ష రాసిన విద్యార్థులు కేంద్రాల నుంచి ఉత్సాహంగా బయటికి వచ్చారు. కేరింతలు కొడుతూ సందడి చేశారు.

– అనంతగిరి



ధారూరు: పదో తరగతి పరీక్షలు ముగియడంతో కేరింతలు కొడుతున్న విద్యార్థులు

రిసార్ట్.. రిలాక్స్

అనంతగిరుల చుట్టూ పదుల సంఖ్యలో రిసార్టులు

- సేదతీరేందుకు తరలివస్తున్న పర్యాటకులు
- ఆహ్లాదాన్ని పంచే పచ్చదనం, సంతోషాన్నిచ్చే గేమ్స్
- అడవి అందాలను ఆస్వాదిస్తూ నైట్ షెల్టర్
- కొత్త అనుభూతి పొందుతున్న జనం

సండే స్పెషల్

ఉరుకుల పరుగుల జీవితం.. పని ఒత్తిడితో సతమతం .. యాంత్రిక జీవనం.. ఇలా చెప్పుకొంటూ పోతే మనిషి జీవితమే నిత్య పోరాటం. ఇలాంటి పరిస్థితుల్లో ఏ కొద్దిపాటి సమయం దొరికినా కుటుంబ సభ్యులు, స్నేహితులతో రిలాక్స్ కావడానికే ఇష్టపడతారు.. ఇక సండే, వీకెండ్ అంటే చిన్నపాటి టూర్‌నే ప్లాన్ చేసుకుంటారు.. ఆహ్లాదాన్ని, ఆనందాన్ని పంచే రిసార్టులకు పరుగులు తీస్తారు. ఉదయం వెళ్లి సాయంత్రం వరకు అక్కడే ఆనందంగా గడుపుతారు. మరి కొందరు రాత్రి అక్కడే బస చేస్తారు.

అనంతగిరి అటవీ ప్రాంతంలో పర్యాటకుల సందడి(ఫైల్)





రిసార్టులో సేద తీరుతున్న పట్టణవాసులు

వికారాబాద్: నగరానికి 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న వికారాబాద్‌కు ఆనుకొని అనంతగిరి కొండలు ఉన్నాయి. ఇవి పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. పట్టణ వాసులు ఇక్కడ సేదతీరడానికి పెద్ద సంఖ్యలో తరలి వస్తుంటారు. పర్యాటకుల రాకను గుర్తించిన కొన్ని సంస్థలు అడ్వెంచర్ గేమ్స్‌ను అందుబాటులోకి తెచ్చాయి. అటవీ ప్రాంతంలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నారు. అడవి అందాల మధ్య రాత్రి వేళ విడిది ఏర్పాటు చేస్తున్నారు. ఇలా పర్యాటకులకు ఆహ్లాదాన్ని పంచుతున్నారు. జనం తాకిడి పెరుగుతుండటంతో అనుబంధ రంగాలు అభివృద్ధి చెందుతున్నాయి. స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయి.

దర్శనీయ ప్రదేశాలు

ఎత్తైన అనంతగిరి కొండలు, దట్టమైన అటవీ ప్రాంతం, మధ్యలో అనంతపద్మనాభ స్వామి, బుగ్గ రామేశ్వర ఆలయాలు ఇక్కడి ప్రత్యేకత. దర్శనీయ ప్రదేశాలు, ట్రెక్కింగ్ స్పాట్లు, వర్షాకాలంలో అడవిలో వాటర్ ఫాల్స్, అరుదైన పక్షి, వృక్ష జాతులు, వేసవిలోనూ చల్లటి వాతావరణం అనంతగిరుల సొంతం. ఈ కొండలకు సమీపంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచే రిసార్టులు.. అందులో అడ్వెంచర్ గేమ్స్, సమీపంలోని ప్రాజెక్టుల్లో బోటింగ్.. రాత్రి విడిదికి ఏర్పాట్లు.. ఇలా అనేక రకాల సదుపాయాలు ఈ ప్రాంతంలో లభిస్తుండటంతో పర్యాటకుల తాకిడి రోజురోజుకూ పెరుగుతోంది.

క్యాంపింగ్ కల్చర్

క్యాంపింగ్ అంటే పట్టణాలకు, ఆవాస ప్రాంతాలకు దూరంగా ఏర్పాటు చేసిన శిబిరాలకు వెళ్లి సేదతీరడం అని అర్థం.. అటవీ ప్రాంతంలో వాతావరణం కూల్‌గా ఉంటుంది. పచ్చని చెట్లు, ఆహ్లాదాన్ని పంచే ప్రదేశాలను ఎంచుకొని శిబిరాలు ఏర్పాటు చేస్తారు. పక్షుల కిలకిల రాగాలు, జంతువుల అరుపుల మధ్యలో నేలపై టెంట్ (శిబిరాలు) ఏర్పాటు చేస్తారు. ఒక ఫ్యామిలీ లేదా ఒక జంట, ఒక వ్యక్తికి ఈ శిబిరాన్ని కేటాయిస్తారు. రాత్రి వేళ చలిమంటలు కాచుకునేందుకు అక్కడక్కడ నెగడులు ఏర్పాటు చేస్తారు. ఈ సదుపాయం పొందాలంటే ముందుగానే ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. రాత్రి మొత్తం ఈ శిబిరంలో గడుపుతూ ప్రత్యేకమైన అనుభూతిని పొందుతారు. చలి మంటల చుట్టూ డ్యాన్స్ చేయడం, పాటలు పాడటం, అడవి జంతువులకు ఇబ్బంది కలగకుండా లైట్, మ్యూజిక్‌ను ఎంజాయ్ చేయడం వంటివి ఇక్కడ చేస్తారు. అయితే కొంతమంది అనుమతులు లేకుండా రిసార్టులను నిర్వహిస్తున్నారు.

అడ్వెంచర్ గేమ్స్

అడ్వెంచర్ గేమ్స్ పల్లె వాసులకు సర్వ సాధారణమే.. వారి జీవితాలు ఇలాంటి సాహసాలతో ముడిపడి ఉంటాయి. కానీ పట్టణ వాసులకు అడ్వెంచర్ అనేది ఓ సాహస క్రీడ.. అవి వారి జీవితాల్లో మరచిపోలేని, మరుపురాని అనుభూతులుగా మిగిలిపోతాయి. ఇలాంటి అడ్వెంచర్ గేమ్స్‌ని అనంతగిరి కొండల సమీపంలో ఏర్పాటు చేశారు. హరివిల్లు సంస్థ ఆధ్వర్యంలో వాటిని నిర్వహిస్తున్నారు. అనంతగిరి కొండల తోపాటు సమీపంలోని పాముల గుట్టలో పర్యాటకులతో ట్రెక్కింగ్ నిర్వహిస్తున్నారు. రోప్ ట్రెక్కింగ్, రివర్స్ జంపింగ్, బీచ్ (శ్యాండ్) వాలీబాల్ తదితర ఇండోర్, ఔట్ డోర్ గేమ్స్ నిర్వహిస్తున్నారు. ఇందుకోసం ఒక్కో ఫ్యామిలీకి ఒక రాత్రితో కూడిన అడ్వెంచర్, వసతి, భోజనం కోసం రూ. 4,500 వరకు వసూలు చేస్తున్నాయి. వేసవి కాలంలో రిసార్టులకు పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది.

అటవీ శిబిరాలు

అనంతగిరి అందాల నడుమ వివిధ సంస్థలు ఏర్పాటు చేస్తున్న అటవీ శిబిరాలు పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. వేల సంఖ్యలో ఇక్కడ సేదతీరడానికి వస్తున్నారు. దేశంలో 50 వేలకు పైగా సంస్థలు క్యాంపింగ్ (అడవిలో శిబిరాలు), క్యాంపింగ్ ఫైర్ (శిబిరంలో మంటలు) ఏర్పాటు చేసినా అనంతగిరి పరిసరాల్లోని శిబిరాలకు ప్రత్యేక స్థానం ఉంది. హరివిల్లు సంస్థ ఏర్పాటు చేసిన శిబిరాల్లో నెలకు 3వేల మందికి పైగా పర్యాటకులు ఎంజాయ్ చేస్తున్నట్లు సమాచారం. హరివిల్లు, వీచిక, ట్రయల్స్, వైల్డర్ నెస్ క్యాంప్ సైట్, పెంగ్విన్, మూన్‌లైట్ అడ్వెంచర్, టిక్కి విలేజ్, నేచర్ రిట్రీట్, అవని వంటి అనేక సంస్థలు అటవీ శిబిరాలు నిర్వహిస్తూ పర్యాటకులకు చేరువ అవుతున్నాయి.



ప్రజల విశ్వాసం కోల్పోయారు

- సీఎం రేవంత్ కొడంగల్‌కు తప్ప జిల్లాకు చేసిందేమీ లేదు
- పార్టీ వీడిన నేతలతో ఎలాంటి నష్టం లేదు
- చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల్లో కాసాని గెలుపు ఖాయం
- ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితారెడ్డి

తాండూరు: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రజల విశ్వాసం కోల్పోయిందని మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితారెడ్డి అన్నారు. శనివారం తాండూరు పట్టణ శివారులోని జీపీఆర్ గార్డెన్‌లో మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అధ్యక్షతన బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆనంద్, సీనియర్ నేత పర్యాద కృష్ణమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా ఉండాల్సిన కొందరు నేతలు కాంగ్రెస్‌లో చేరడం దారుణమన్నారు. అలాంటి వారికి ఈ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని కోరారు. ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో సీఎం రేవంత్‌రెడ్డి విఫలమయ్యారని ఆరోపించారు. సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్‌కు నిధులు మంజూరు చేసుకున్నారే తప్ప జిల్లా గురించి పట్టించుకోలేదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే జిల్లా వేగంగా అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. కేసీఆర్ హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దారని తెలిపారు. బీసీ నేత కాసానికి చేవెళ్ల ఎంపీ టికెట్ ఇచ్చారని, ఆయన్ను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. 40 ఏళ్ల రాజకీయ జీవితంలో బీసీ కులాల ఐక్యత కోసం అలుపెరగని పోరాటం చేసిన చరిత్ర కాసాని సొంతమన్నారు. అలాంటి నేతను ప్రజలు అక్కున చేర్చుకోవాలని కోరారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ.. గతంలో ఇక్కడి ప్రజలు బీఆర్ఎస్ నుంచి ఇద్దరు ఎంపీలను గెలిపించారని, ఈ సారి కూడా అండగా నిలిచేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. బీజేపీ అభ్యర్థి విశ్వేశ్వర్‌రెడ్డికి ప్రజల్లో విశ్వాసం లేదని, రంజిత్‌రెడ్డి రన్నింగ్ రెడ్డిలా మారారని అన్నారు. ఆ రెండు పార్టీలకు ఓటమి తప్పదని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సందల్ రాజుగౌడ్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీప, తాండూరు జెడ్పీటీసీ మంజుల, పార్టీ పట్టణ అధ్యక్షుడు నయీమ్, పెద్దేముల్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ వీణా, నాయకులు నర్సింహులు, శ్రీనివాసాచారి, వెంకట్‌రెడ్డి, సాయిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సబితారెడ్డి

ఏసీబీ వలలో ఎస్ఐ



ఎస్ఐ సైదులు

మీర్‌పేట: నోటరీ ప్లాటు విక్రయ సెటిల్‌మెంట్ వ్యవహారంలో రూ.10 వేలు లంచం తీసుకుంటూ సబ్ ఇన్‌స్పెక్టర్ సైదులు అడ్డంగా దొరికిపోయాడు. మీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. నాదర్‌గుల్‌కు చెందిన షేక్ నజీముద్దీన్ గత డిసెంబర్‌లో సర్వే నంబర్ 197లోని తన 200 గజాల నోటరీ ప్లాటును గుర్రంగూడకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి మాదాని సుభాష్‌కు రూ.4.80 లక్షలకు విక్రయించేందుకు ఒప్పందం చేసుకున్నాడు. దీంతో సుభాష్ రూ.2.10 లక్షలు బయానా చెల్లించి ప్లాటుకు సంబంధించిన ఒరిజినల్ పత్రాలను తీసుకుని అగ్రిమెంట్ చేసుకున్నాడు. ఈ ప్లాటు కొంత కాలంగా కోర్టు వివాదంలో ఉండడం, తాజాగా కోర్టు కేసు అనుకూలంగా వచ్చే అవకాశం ఉండడంతో నజీముద్దీన్ తన ప్లాటును తిరిగి ఇచ్చేయాలని ఒత్తిడి తేగా సుభాష్ అంగీకరించలేదు. దీంతో నజీముద్దీన్ ఈ నెల 23న మీర్‌పేట పోలీస్ స్టేషన్ ఎస్ఐ బొడ్డుపల్లి సైదులుకు ఫిర్యాదు చేశాడు. సివిల్ వివాదంలో తలదూర్చిన పోలీసు అధికారి సుభాష్‌ను స్టేషన్‌కు పిలిపించి ప్లాటు పత్రాలు వెనక్కి ఇవ్వకపోతే, అవి పోయినట్లు దొంగతనం కేసు పెడతానని బెదిరించాడు. దీంతో భయపడిన సుభాష్ ప్లాట్ కాగితాలు నజీముద్దీన్‌కు ఇచ్చేందుకు అంగీకరించాడు. ఈ వ్యవహారాన్ని సెటిల్ చేసి ఎస్ఐ సుభాష్‌కు రూ.1.40 లక్షలు ఇప్పించాడు. ఇందులో తనకు రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేయగా, రూ.5వేలు ఇస్తానని ఒప్పుకొన్నాడు. ఆ తర్వాత ఓసారి మధ్యవర్తి ముత్యంరెడ్డితో కలిసి స్టేషన్‌కు వచ్చాడు. రూ.10 వేలు ఇస్తామని చెప్పడంతో ఎస్ఐ ఓకే చెప్పాడు. ఈ వ్యవహారాన్నంతా బాధితుడు ముందుగానే సెల్‌ఫోన్‌లో రికార్డు చేసి ఏసీబీ అధికారులకు పంపాడు. శనివారం పీఎస్‌కు వచ్చిన సుభాష్ నుంచి ఎస్ఐ రూ.10 వేలు తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ అధికారులు పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ విలేకరులతో మాట్లాడుతూ.. ఎస్ఐ సైదులును మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చడంతో పాటు అతని ఇంట్లోని ఫైళ్లను తనిఖీ చేసినట్టు తెలిపారు. 2021లో సరూర్ నగర్ పీఎస్‌లో విధులు నిర్వర్తించిన సమయంలోనూ ఇలాంటి కేసులోనే ఎస్ఐ సైదులు సస్పెండ్ అయ్యాడని స్పష్టం చేశారు. లంచం కోసం ఇబ్బంది పెడితే తమకు ఫిర్యాదు చేయాలన్నారు.

చేవెళ్లలో మాదే విజయం

- మోదీతోనే అవినీతి రహిత పాలన సాధ్యం
- ఎంపీ అభ్యర్థి విశ్వేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

కుల్కచర్ల: దేశాభివృద్ధిని కాంక్షించే వారు బీజేపీకి ఓటు వేయాలని ఆ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ముజాహిద్‌పూర్, రాంనగర్, బండవెల్కిచర్ల, సాల్వీడు, ఘణపూర్, చౌడాపూర్, కొత్తపల్లి, కల్మన్ కాల్వ గ్రామాల్లో బీజేపీ విజయ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుటుంబ పార్టీలకు ఓటేస్తే వారి వ్యక్తిగత ప్రయోజనాల కోసం పని చేస్తాయని ఆరోపించారు. దేశం కోసం, ధర్మం కోసం, అవినీతి రహిత పాలన అందించే బీజేపీకే ఓటు వేయాలని కోరారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ ముగిసిన అధ్యాయమన్నారు. కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్ తరహాలోనే సాగుతోందని ఆరోపించారు. యువత మోదీ నాయకత్వాన్ని కోరుకుంటోందని తెలిపారు. వారి మద్దతుతోనే చేవెళ్లలో ఘన విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు ఆలోచించి ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రత్నం, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాదరావు, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతికిరణ్, పార్టీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ఘణపురం వెంకటయ్య, మండల అధ్యక్షుడు సురేష్, మాజీ అధ్యక్షుడు మైపాల్, బీజేవైఎం మండల అధ్యక్షుడు మైపాల్, ప్రధాన కార్యదర్శి హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

2నుంచి ఎన్నికల సిబ్బందికి శిక్షణ

కలెక్టర్ నారాయణరెడ్డి

అనంతగిరి: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా ఏప్రిల్ 2 నుంచి 4వ తేదీ వరకు పీఓ, ఏపీఓలకు శిక్షణ ఇవ్వనున్నట్లు కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. శనివారం ఎన్నికల ఏర్పాట్లు, శిక్షణ తదితర అంశాలపై జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పోస్టల్ బ్యాలెట్ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఎన్నికల విధులు నిర్వహించే పీఓ, ఏపీఓలు, ఇతర సిబ్బంది, అధికారులకు శిక్షణ ఇవ్వడంపై సీఈఓ పలు సూచనలు సలహాలు చేశారు. అనంతరం కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులతో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికలు సజావుగా సాగడానికి అన్ని ఏర్పాట్లు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలో మొదటి ర్యాండమైజేషన్ ద్వారా 1,257 మంది పీఓలు, 1,257 మంది ఏపీఓలు, 2,515 మంది ఓపీలకు శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. ఏప్రిల్ 2, 3, 4 తేదీల్లో శిక్షణ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఇందులో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్, తాండూరు, వికారాబాద్ ఆర్డీవోలు శ్రీనివాసరావు, వాసు చంద్ర, డీఈఓ రేణుకాదేవి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

తాగునీటి సమస్య రావొద్దు

జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. శనివారం కలెక్టరేట్ నుంచి టెలీకాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడారు. బోర్ వెల్స్, చేతి పంపులు పనిచేయకపోతే వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. తాగునీటి సరఫరాలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

క్లుప్తంగా

'కోడ్' కూసినా ముసుగు పడలే..



మొయినాబాద్ ప్రధాన కూడలిలో ముసుగు లేకుండా ఉన్న ఇంద్రారెడ్డి విగ్రహం

మొయినాబాద్: ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో.. బహిరంగ ప్రదేశాల్లో రాజకీయ నాయకుల విగ్రహాలు కనిపించకుండా ముసుగు వేస్తారు. కానీ ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ.. మొయినాబాద్ ప్రధాన కూడలిలోని మాజీ హోంమంత్రి దివంగత నేత ఇంద్రారెడ్డి విగ్రహానికి తెల్లని వస్త్రం కప్పకుండా వదిలేశారు. కోడ్ కూసి పక్షం రోజులు గడుస్తున్నా.. సంబంధిత అధికారులు రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగు వేయకుండా వదిలేయడంతో పలు విమర్శలకు తావిస్తోంది.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అశోక్‌కుమార్


నూతన కమిటీ సభ్యులు

అనంతగిరి: వికారాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎం.అశోక్‌కుమార్ ఎన్నికయ్యారు. ఆయనతో పాటు ఉపాధ్యక్షుడిగా సయ్యద్ ఖయూమ్, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్.వెంకటేషం, జాయింట్ సెక్రటరీగా జనార్దన్, లైబ్రేరియన్‌గా రమేష్‌నాయక్, మహిళా ప్రతినిధిగా వసుంధర, కోశాధికారిగా సాయిరాం, గెమ్స్, కల్చరల్ సెక్రటరీగా ఎం.రాజు, కార్యవర్గ సభ్యులుగా పరమేష్, సుధాకర్‌రెడ్డి, కృష్ణ, యాసిన్ ఖురేషి, సయ్యద్ యాసిన్, సంజీవ్‌కుమార్‌లను నియమించారు. ఈ సందర్భంగా నూతన సభ్యులకు సహచర న్యాయవాదులు శుభాకాంక్షలు తెలిపారు.

గడ్డి వాములు దగ్ధం


తగలబడుతున్న గడ్డి వాములు

తలకొండపల్లి: గడ్డి వాములు దగ్ధమైన సంఘటన మండల పరిధి చుక్కాపూర్‌లో శనివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కమ్మరి పుల్లయ్య, మైపాల్ నాయక్‌లకు చెందిన రెండు గడ్డి వాములు కాలిపోయాయి. ఈ ఘటనపై బాధిత రైతులు మాట్లాడుతూ.. ఎవరో కావాలనే తమ గడ్డి వాములకు నిప్పు పెట్టారని ఆరోపిస్తూ.. ఆవేదన వ్యక్తంచేశారు. వాటి విలువ సుమారు రూ.2 లక్షల వరకు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

నిర్మించారు.. వదిలేశారు

- బడి భవనం నిరుపయోగం
- ఊరికి దూరంగా నిర్మాణం
- ఆసక్తి చూపని విద్యార్థులు
- రూ.30 లక్షల ప్రజాధనం వృథా


ఏళ్ల తరబడి నిరుపయోగంగా పాఠశాల భవనం

బంట్వారం: విద్యాభివృద్ధికోసం కొత్త భవన నిర్మాణానికి పుష్కరకాలం క్రితం శ్రీకారం చుట్టారు. ఊరికి దూరంగా రూ.లక్షలు వెచ్చించి ఉన్నత పాఠశాల భవనం నిర్మించారు. నాటి ప్రజాప్రతినిధులు అట్టహాసంగా ప్రారంభించారు. కానీ.. విద్యార్థులకు దూరభారం కావడంతో.. పక్షం రోజులు గడవక ముందే తాళం పడింది. ఇక నాటి నుంచి నిరుపయోగంగా ఉండి, బూత్ బంగ్లాను తలపిస్తోంది.

రూ.30 లక్షలతో

బంట్వారం మండలం తొర్మామిడిలో అదనపు పాఠశాల భవనం నిర్మాణం కోసం 2009లో రూ.30 లక్షలు మంజూరయ్యాయి. ఆ నిధులతో నిర్మించిన భవనాన్ని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి 14 ఏళ్ల కిందట ప్రారంభించారు. ఈ భవనంలో 6 నుంచి పదో తరగతి విద్యార్థులు చదువుకునేందుకు అధికారులు అప్పట్లో అన్ని ఏర్పాట్లు చేశారు. అంతకు ముందు గ్రామంలో ఉన్న పాత భవనాన్ని పూర్తిగా ప్రాథమిక పాఠశాలకు కేటాయించారు.

ఆదిలోనే హంసపాదు

నూతన జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల భవనానికి ఆదిలోనే హంస పాదు ఎదురైంది. పట్టుమని పది రోజులు కూడా కొత్త భవనంలో తరగతులు కొనసాగలేదు. ఊరికి 3 కిలో మీటర్ల దూరం పాఠశాల ఉండటంతో విద్యార్థులకు దూరభారం అయింది. నడవలేక పోయారు. దీంతో చేసేది లేక యథావిధిగా ఊరిలోని పాత పాఠశాల భవనంలోకి మార్చారు.

ప్రజాధనం వృథా

రూ. లక్షలు వెచ్చించి నిర్మించిన పాఠశాల అదనపు భవనం వృథా అయి, ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరులా మారింది. విద్యార్థులకు ఎలాంటి ఉపయోగం లేకపోగా, ప్రభుత్వ ఆశయం నీరుగారి పోయింది. పుష్కర కాలానికి పైగా భవనం నిరుపయోగంగా ఉంచడంతో పిచ్చి మొక్కలు, చెట్లు పెరిగి బూతు బంగ్లాను తలపిస్తోంది. అసాంఘిక కార్యకాలాపాలకు అడ్డాగా మారింది.

అధికారుల దృష్టికి తీసుకెళ్తా



సమస్యను విద్యా శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా. అప్పట్లో ఊరికి మూడు కిలో మీటర్ల దూరంలో పాఠశాల భవనం నిర్మించారు. విద్యార్థులు అంత దూరం నడవ లేకపోయారు. చేసేది లేక.. పాత భవనంలోనే హైస్కూల్ కొనసాగుతోంది. ఏదీ ఏమైనప్పటికీ.. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు వివరిస్తా.

– చంద్రప్ప ఎంఈఓ

కాషాయ జెండా ఎగరడం ఖాయం

బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి


ఆశీర్వాద యాత్రలో మాట్లాడుతున్న విశ్వేశ్వర్ రెడ్డి

దోమ: బీజేపీపై ప్రజల్లో సానుకూలత ఉన్నదని ఆ పార్టీ చేవెళ్ల అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధి గొడుగోనిపల్లి, బాసుపల్లి, దోమ, ఐనాపూర్, మల్లెపల్లి గ్రామపంచాయతీలో ప్రజా ఆశీర్వాద యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీ ఆధ్వర్యంలోనే దేశం సురక్షితంగా ఉండగలుగుతుందని ప్రజలు నమ్ముతున్నారని, అందుకే బీజేపీకి ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కుటుంబ పార్టీలకు బుద్ధి చెప్పు.. చేవెళ్లలో కాషాయ జెండా ఎగురవేయడం ఖాయమని ఆశాభావం వ్యక్తంచేశారు.

మోదీనే బలమైన శక్తి

ప్రస్తుతం దేశంలో బలమైన శక్తి అధికారంలో ఉండాల్సిన అవసరం ఉందని, అది ఒక్క మోదీతోనే సాధ్యమన్న భావనలో దేశ ప్రజలు ఉన్నారని కొండా పేర్కొన్నారు. ఏ పార్టీకి ఓటు వేసినా వారు తమ కుటుంబాలను ఉన్నతిలోకి తెచ్చుకునేందుకు స్కాంలు చేయడం, పదవులు పంచుకోవడం, అవినీతికి పాల్పడటం వంటివి చేస్తారు తప్పిస్తే, దేశ ప్రజల గురించి ఆలోచించే నాయకులు ఇతర పార్టీల్లో కనిపించరని వివరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి బలవన్మరణం


మృతుడు యాదగిరి(ఫైల్)

దౌల్తాబాద్: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం ఉదయం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. దౌల్తాబాద్‌కు చెందిన గాజులవోని యాదగిరి(27) శుక్రవారం రాత్రి 10గంటలకు ఇంట్లో భోజనం చేసి బయటకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లాడు. శనివారం ఉదయం వరకు తిరిగి రాలేదు. ఈ క్రమంలో గ్రామ శివారులో ఓ చెట్టుకు ఉరేసుకుని వేలాడుతూ అటుగా వెళ్తున్నవారికి కనిపించాడు. వెంటనే కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి భార్య మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీశైలం యాదవ్ తెలిపారు. మృతుడికి భార్యతో పాటు కుమార్తె, కూతురు ఉన్నారు.

బైక్ అదుపు తప్పి యువకుడికి గాయాలు

కడ్తాల్: బైక్ అదుపు తప్పి ఓ యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన కడ్తాల్–తలకొండపల్లి రహదారి మక్తమాధారం గేటు శివారులో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కడ్తాల్ మండలం రావిచెడ్ గ్రామానికి చెందిన చింటూ.. తలకొండపల్లి మండలం దేవుని పడకల్ జాతరకు బైక్ పై వెళ్తుండగా.. గేటు సమీపం మూల మలుపు వద్ద బైక్ అదుపు తప్పి, రోడ్డు పక్కనే ఉన్నా కడీలను ఢీ కొట్టింది. ఈ ఘటనలో చింటూకు గాయాలు అయ్యాయి. గమనించిన స్థానికులు.. చికిత్స నిమిత్తం యువకున్ని 108లో ఆస్పత్రికి తరలించారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

తాండూరు రూరల్: అనుమానాస్పదస్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం చించోళి తాలూకా చిన్నలింగంపల్లి గ్రామానికి చెందిన డప్పు దశరథ్(45), 6 నెలల క్రితం తాండూరు మండలం కరన్‌కోట్ గ్రామంలోని బంధువు ఇంటికి వచ్చాడు. ఇక్కడే ఉంటూ కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. దశరథ్ ఎప్పటిలాగే గ్రామానికి చెందిన కొత్త నర్సయ్యగౌడ్ పొలంలోని కట్టెలను ట్రాక్టర్లో నింపేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పక్కన దశరథ్ విగతజీవిగా కనిపించాడు. సమాచారం అందడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. దశరథ కుడి చేతికి, ఎడమకాలు పాదం వద్ద గాయాలు ఉన్నట్లు గుర్తించారు. మృతుడి భార్య మనోజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. దశరథ్ మృతిపై అనుమానం ఉందని మృతుడి భార్య ఫిర్యాదులో పేర్కొంది.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


వ్యక్తి మృతదేహం

తాండూరు రూరల్: గుర్తు తెలియని వ్యక్తి శవం కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం లభ్యమయింది. ఎస్‌ఐ విఠల్‌రెడ్డి వివరాల ప్రకారం.. సుమారు (55) ఏళ్ల వయసున్న వ్యక్తి మృతదేహం బెల్కటూర్ గ్రామ శివారులోని నాగమ్మ పొలం వద్ద పడుంది. మృతుడు ఒంటిపై తెలుపు రంగు అంగి, ఎరుపు రంగు బనియన్, నల్లని ప్యాంటు ఉన్నాయి. పరిసరాలను పరిశీలించి, మృత దేహాన్ని తాండూరు జిల్లా ఆస్పత్రి మార్చురికి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు.. ఫోన్ నంబర్ 87126 70052, 87126 70051లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

చెరువు కబ్జాకోరులపై చర్యలు తీసుకోండి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మత్స్యకార్మిక సంఘం నేతలు

మంచాల: చెరువుల కబ్జాకు పాల్పడుతున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులపై ప్రభుత్వం చర్య తీసుకోవాలని మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మండల పరిధి తిప్పాయి గూడ గ్రామంలో పెద్దరోని కుంట చెరువును పరిశీలించి, యాదాద్రి నారాయణపురం తహసీల్దార్ కృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భూ వ్యాపారులు, కుంట చుట్టూ మట్టి నింపుతూ రావడమే గాకుండా.. ఎఫ్‌టీఎల్ పరిధి లేకుండా చేశారని ఆరోపించారు. ఈ కుంట చెరువు నారాయణపురం రెవెన్యూ పరిధిలోకి వస్తుందని పేర్కొన్నారు. చెరువు కబ్జాకు గురవడం వలన మత్స్యకారులతో పాటు రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. కబ్జాదారుల నుంచి చెరువును విడిపించాలని కోరారు. ఇందులో మత్స్యకారులు కృష్ణ, గోపాల్ తదితరులు ఉన్నారు.

డంపు యార్డులో చెలరేగిన మంటలు

దుర్వాసనతో కూడిన పొగతో స్థానికుల ఉక్కిరిబిక్కిరి


దగ్ధమవుతున్న చెత్త

షాద్‌నగర్: మున్సిపాలిటీ పరిధి సోలీపూర్ గ్రామ శివారులోని చెత్త డంపు యార్డులో శనివారం ఉదయం మంటలు చెలరేగాయి. దీంతో గ్రామంలో దట్టమైన పొగ వ్యాపించింది. విషయం తెలుసుకున్న మున్సిపల్ సిబ్బంది.. వెంటనే నీటి ట్యాంకర్ల సహాయంతో మంటలను ఆర్పేశారు. కాగా.. డంపు యార్డును వెంటనే ఇక్కడి నుంచి తరలించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. తరుచూ డంప్ యార్డులో మంటలు చెలరేగుతూ.. దుర్వాసనతో కూడిన పొగ వ్యాపించి ఉక్కిరిబిక్కిరి అవుతున్నామని వాపోయారు. రోగాలా బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. షాద్‌నగర్ శివారులో నూతనంగా నిర్మించ తలపెట్టిన నూతన డంప్ యార్డు పనులను వెంటనే పూర్తి చేసి, అక్కడికి తరలించాలని కోరారు.

నెమలి మృత్యువాత


నెమలి కళేబరం

ఇబ్రహీంపట్నం రూరల్: ఎండలు మంటలు పుట్టిస్తుండటంతో పశుపక్షాదులు అల్లాడిపోతున్నాయి. తాగునీరు లేకనో, వేడికి తట్టుకోలేకనో ఆ వన్య ప్రాణులు ప్రాణాలు కోల్పోతున్నాయి. తాజాగా వేసవి తాపానికి తాళలేక జాతీయ పక్షి నెమలి మృత్యువాత పడింది. ఈ సంఘటన ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధి ఎంపీపటేల్ గూడ రెవెన్యూలో ఔటర్‌రింగ్‌రోడ్డుకు సమీపంలో శనివారం చోటు చేసుకుంది.

'టంగటూరు' కేసులో మరో నిందితుడి అరెస్టు

మణికొండ: శంకర్‌పల్లి మండలం టంగటూరు గ్రామంలో ముగ్గురు కుమారులను హత్య చేసి, తాను ఆత్మహత్య చేసుకున్న నీరటి రవి కేసులో మరో నిందితున్ని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు వివరాలను శనివారం నార్సింగి ఏసీపీ జీవీ రమణగౌడ్ విలేకరులకు తెలిపారు. మార్చి 3వ తేదీన టంగటూరు గ్రామానికి చెందిన నీరటి రవి ఇంట్లో తన ముగ్గురు కుమారులను చంపి, అతను కొత్తగా నిర్మిస్తున్న ఫంక్షన్‌హాల్ వద్ద ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన విషయం తెలిసిందే. అతని భార్య శ్రీలత ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన మోకిల పోలీసులు ఇప్పటికే ఈ కేసులో హోంగార్డు నాగరాజు, విలేకరులు ఎస్ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్.ప్రవీణ్‌కుమార్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. కేసులో ఏ–1గా ఉన్న తిరుపతిరావును శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా మనీ సర్క్యులేషన్ స్కీములో భాగంగా రవి మండలవ్యాప్తంగా వందలాది మందిని సభ్యులుగా చేర్పించాడు. అతను సభ్యుల నుంచి భారీ మొత్తం వసూలు చేయగా సంస్థ నిర్వాహకుడైన తిరుపతిరావుకు మాత్రం రూ.13 లక్షలు మాత్రమే పంపాడని, ఆధారాలతో విచారణలో తిరుపతి రావు ఈ విషయం వెల్లడించాడని ఏసీపీ తెలిపారు. ఈ కేసులో మరో ముగ్గురు పరారీలో ఉన్నారని, వారిని పట్టుకునేందుకు టీములు వెతుకుతున్నాయని ఏసీపీ తెలిపారు. విలేకరుల సమావేశంలో మోకిల సీఐ హరిబాబు పాల్గొన్నారు.

ఐరాసలో హ్యాట్రిక్ ప్రసంగం

అంతర్జాతీయ వేదికపై బషీరాబాద్ యువకుడి వాణి



ఐరాసలో మాట్లాడుతున్న సాయిసంపత్

బషీరాబాద్: గ్రామీణ యువకుడు ఐరాస వేదికగా పలుమార్లు ప్రసంగించి, జిల్లా పేరును ప్రపంచానికి చాటి చెప్పారు. బషీరాబాద్ మండలం బాద్లాపూర్ గ్రామానికి చెందిన మెట్టు సాయిసంపత్.. అంతర్జాతీయ వేదికపై మూడుసార్లు తనవాణి వినిపించి సత్తాచాటాడు. జెనీవాలోని ఐక్యరాజ్య సమితి కార్యాలయంలో ఏటా మార్చి, జూన్, సెప్టెంబర్ మాసాల్లో నెల రోజుల పాటు వివిధ అంశాలపై సమావేశాలు నిర్వహిస్తుంటారు. వీటికి వివిధ దేశాల నుంచి దౌత్యవేత్తలు, పరిశీలకులు, ఎన్‌జీఓ ప్రతినిధులు, మానవ హక్కుల పరిరక్షకులు హాజరవుతుంటారు. ఇలాంటి వేదికపై మారుమూల గ్రామానికి చెందిన యువకుడికి మూడుసార్లు పాల్గొనే అవకాశం దక్కడం జిల్లాకే గర్వకారణమని గ్రామస్తులు అభినందిస్తున్నారు.

వ్యవసాయ రంగంపై..

ఎంఏ (రూరల్ డెవలప్‌మెంట్) చదువుకున్న సాయి.. 2015లో 'ఈకోపోన్' ఎన్‌జీఓను స్థాపించాడు. 2023 మార్చిలో దళిత ప్రోగ్రెసివ్ సమావేశాల్లో పాల్గొని మాట్లాడారు. భారత్‌లో దళితుల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేటపట్టిన పథకాలు, వాటి ఫలితాలను ఐరాస వేదికగా వినిపించారు. అదే సంవత్సరం సెప్టెంబర్‌లో సమీక్షకు హాజరైనప్పటికీ.. అవకాశం దక్కలేదు. మూడోసారి 2024 మార్చిలో వ్యవసాయ రంగంపై ప్రారంభమైన చర్చలో పాల్గొని మాట్లాడారు. భారత్‌లో విదేశీ కలుపు మొక్కల వలన వ్యవసాయ రంగం తీవ్రంగా దెబ్బతింటుందని, తద్వారా రైతులు అప్పుల పాలవుతున్నారని వెల్లడించారు. భారత ప్రభుత్వం ఉపాధిహామీ పథకం కింద వ్యవసాయ రంగాన్ని తీసుకువచ్చి, రసాయనాలు వాడకుండా ఆర్గానిక్ పద్ధతుల్లో రంగాన్ని తీసుకెళ్తే.. భూమి, నీరు, గాలి కాలుష్యం నుంచి ఏడేళ్లలో బయటపడుతుందని వివరించారు. దీంతో ఈ 36 ఏళ్ల యువకుడు చేసిన ప్రసంగంపై ఐరాస ప్రతినిధులు బల్లలు చరిచి అభినందించారు.

గుడుంబా స్థావరాలపై దాడులు


గుడుంబా స్థావరంపై దాడి చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

బెల్లం ఊట ధ్వంసం, పది మందిపై కేసులు నమోదు

తాండూరు టౌన్: గుడుంబా స్థావరాలపై శనివారం ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి, బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఎక్సైజ్ సీఐ బాలగంగాధర్ వివరాల ప్రకారం.. నీలిగడ్డ తండా, మదనంతాపూర్ తండాల్లో దాడులు చేసి, 2,600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. 12 కిలోల బెల్లంను స్వాధీనం చేసుకుని, పది మందిపై కేసులు నమోదు చేశారు. ఓమ్లానాయక్‌తండా, రామ్‌సింగ్‌తండా, పాషాపూర్‌తండా, బాయిమీది, బాయికింది, షాదీపూర్ తండాలతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. ఈ నెలలో మొత్తం 3,650 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేయగా, 41 మందిపై కేసుల నమోదు చేసి 19 మందిని అరెస్టు చేశారు. నల్ల బెల్లం విక్రయిస్తున్న కిరాణా దుకాణ యజమాని హరికృష్ణను అరెస్టు చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా గుడుంబా తయారీ చేస్తే, చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

గంజాయి పట్టివేత


గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు

కొందుర్గు: ద్విచక్ర వాహనంపై అక్రమంగా తరలిస్తున్న గంజాయిని జిల్లేడ్ చౌదరిగూడ పోలీసులు శనివారం పట్టుకున్నారు. ఎస్‌ఐ సక్రమ్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లేడ్ చౌదరిగూడ మండలం ముష్టిపల్లి చౌరస్తాలో వాహనాలను తనిఖీ చేస్తుండగా.. స్కూటీలో 150 గ్రాముల గంజాయి పట్టుబడింది. గంజాయి తరలిస్తున్న మహబూబ్‌నగర్ జిల్లా వాసి పంకజ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా.. బీహార్ రాష్ట్రం, ముజఫర్ జిల్లా, పారు మండలం కమల్‌పూరాకు చెందిన గణేశ్ అనే వ్యక్తి గంజాయి సరఫరా చేస్తున్నట్లు నిందితుడు తెలిపాడు. అనంతరం పంకజ్‌రాజ్‌ను అదుపులోకి తీసుకుని, కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు వెల్లడించారు. ప్రధాన నిందితుడు గణేశ్ పరారీలో ఉన్నాడని ఎస్‌ఐ తెలిపారు.

విద్యాభివృద్ధిలో ఇంకుబేషన్ అత్యవసరం



సమావేశంలో మాట్లాడుతున్న జయేష్‌రంజన్

రాష్ట్ర ఇన్‌ఫర్‌మేషన్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్‌రంజన్

మొయినాబాద్‌రూరల్: ఆవిష్కరణల ప్రాముఖ్యతను తెలపడానికి ఈవెంట్లు తప్పనిసరని రాష్ట్ర ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్‌రంజన్ అన్నారు. శనివారం మండల పరిధి అమ్డాపూర్ జేబీ విద్యా సంస్థలో ఏర్పాటు చేసిన జేబీజీఐఈ ఇన్నోవేషన్, ఇంకుబేషన్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడారు. టీ–హబ్ సహకారంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఇలాంటి సెంటర్లను ప్రారంభించడం విద్యాసంస్థలకు, విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. జేబీ విద్యా సంస్థల కార్యదర్శి జే.వి.కృష్ణారావు మాట్లాడుతూ.. విద్యా వ్యవస్థలో అనేక సంస్కరణలు తీసుకువస్తూ, పోటీతత్వానికి తట్టుకునే విధంగా విద్యార్థులను తయారు చేస్తున్నామని తెలిపారు. అనంతరం ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్‌రంజన్‌ను కళాశాల కార్యదర్శి జే.వి.కృష్ణారావు సన్మానించారు. కార్యక్రమంలో టీ–హబ్ చీఫ్ డెలివరి అధికారి అవిష్ ఆంథోని, కోలకలూరి ఇనోచ్, ఆయా కళాశాలల ప్రిన్సిపాలలు, ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం


కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న త్రిదండి చిన్న జీయర్ స్వామి

మియాపూర్: మియాపూర్‌లోని ప్రశాంత్‌నగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ పద్మావతి గోదాదేవి సమేత, శ్రీ వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్ల కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. శనివారం స్వామి వార్లకు అభిషేకాలు నిర్వహించి పలు రకాల పూలతో ఆకర్షణీయంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు, మంగళ వాయిద్యాల మధ్య స్వామి వారి కల్యాణాన్ని జరిపించారు. ఉత్సవాలకు చినజీయర్ స్వామి హాజరై భక్తులనుద్దేశించి ప్రసంగించారు. ప్రతి వస్తువు, మనిషిలో దేవుడు ఉన్నాడని, ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో దేవుడిని కొలవాలని కోరారు. ఆలయ వ్యవస్థాపకులు పొట్టి వెంకటేశ్వర్లు, సుజాత, రాజమౌళి, సువర్ణ దంపతులను అభినందించారు.